మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి

శనివారం 17 ఫిబ్రవరి 2024 పేజీలు 8

# కమలం టార్గెట్ పాలమూరు




- విజయసంకల్ప యాత్రే లక్ష్యం
- శాంతికుమార్ వైపు బిసిల చూపు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మేజర్‌న్యూస్:** త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ జనంలోకి వెళ్తుంది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ రెండు పార్లమెంట్ స్థానాల్లో పాలమూరు స్థానంపైనే ప్రత్యేక గురి పెట్టింది. ఎందుకంటే గతంలో ఈ నియోజకవర్గం నుండి బిజెపి అభ్యర్థులు ఎంపి, ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఈ స్థానాన్ని ఖచ్చితంగా దక్కించుకోవాలని ఉద్దేశ్యంతో కమల నాథులు పాలమూరుపై ఫోకస్ పెట్టారు. ఇక్కడ కాంగ్రెస్, బిఆర్‌యస్‌లకు ధీటుగా పార్లమెంట్ అభ్యర్థిని రంగంలోకి దింపెందుకు పావులు కదుపుతుంది. విజయ సంకల్ప యాత్రే లక్ష్యంగా బిజెపి నేతలు జనంలోకి వెళ్తున్నారు. ఇప్పటివరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అగ్రవర్ణాలకు చెందిన ఎపి జితేందర్ రెడ్డి, డికె అరుణలు ఎంపి, ఎమ్మెల్యేలుగా పదవులు అనుభవించారు. జితేందర్ రెడ్డి ఒక్కసారి ఎంపిగా, డికె అరుణ రెండు సార్లు ఎమ్మెల్యేగా కొనసాగారు. అయితే ఎస్సి, ఎస్టీ, బిసి మైనార్టీలు అధికంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బిసి వర్గానికి చెందిన ఓటు అధికంగా ఉండడంతో కమలం పార్టీ ఈ సారి బిసి అభ్యర్థిని రంగంలోకి దింపె అవకాశం ఉందని తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బిసి అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తాము అని హామి ఇచ్చిన బిజెపి ఇప్పుడు మహబూబ్‌నగర్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో బిసి అభ్యర్థికి అవకాశం కల్పిస్తామని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీకి విధేయుడుగా ఉంటు 14 ఏళ్ళపాటు సేవలందిస్తున్న బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్ పేరు తెరపైకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనకు అవకాశం ఇస్తే సహకరిస్తామని బిసి సంఘాల నాయకులు ఇదివరకే ప్రకటించారు. ఇలా ఉంటే బిజెపి తరపున ఈ నెల 20వ తేదీ నుండి విజయ సంకల్ప బస్సు యాత్ర ప్రారంభం కానుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్ నియోజకవర్గంలో కృష్ణ మండలం నది పరివాహక ప్రాంతం నుండి ఈ విజయ సంకల్పయాత్ర ప్రారంభం కానుంది. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ మూడు పార్లమెంట్ నియోజకవర్గాలను కలుపుతూ ఈ యాత్ర కొనసాగుతుందని

మిగతా 2లో



# ఆశలన్నీ రేవంత్‌పైనే

- కొడా ఏర్పాటుపై అధికారుల సన్నాహాలు
- 69 జిఓ అమలుతో పేట జిల్లా సస్యశామలం
- పాలమూరు - రంగారెడ్డిపై ఆయకట్టు దారులో చిగురిస్తున్న ఆశలు
- 18న సిఎం రేవంత్ రెడ్డి కోస్గి రాక

**మహబూబ్‌నగర్ బ్యూరో, మేజర్‌న్యూస్:** తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 18వ తేదీన ఆయన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లోని కొడంగల్ నియోజకవర్గంలో పర్యటనకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గం నుండి బంఫర్ మెజార్టీతో గెలుపొందిన సిఎం రేవంత్‌రెడ్డి తను నియోజకవర్గంలో ఈ నెల 18న పర్యటించి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగానికి తగు ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తుంది. అధికారుల సమాచారం మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 18వ తారీఖు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అక్కడ కోస్గిలో పలు అభివృద్ధి పతకాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో పెద్ద ఎత్తున నిర్వహించే మహిళా సంఘాల సమావేశానికి హాజరు కానున్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో శంకుస్థానలు చేయనున్నారు. ఈ మేరకు ఇప్పటికే అధికారికంగా షెడ్యూల్డు ఖారారు అయిందని అధికార

మిగతా 2లో



## పట్టణ అభివృద్ధి కోసం

# సమిష్టి కృషి అవసరం

### - మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో చైర్మన్ బిఎస్ కేశవ్



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** పట్టణ అభివృద్ధి కోసం సమిష్టి కృషి అవసరమని మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ అన్నారు. శుక్రవారం మునిసిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. మునిసపల్ బడ్జెట్ అంచన ఆదాయం 2024-25 (సాధారణ నిధులు ) రూ. 1959. 65లక్షలు కాగా అంచన కాపిటల్ ఆదాయం 15ఎఫ్. సి. రూ. 500.లక్షలు పట్టణ ప్రగతి రూ. 550. లక్షలు. స్వచ్ఛ భరత్ రూ. 75.00 లక్షలు. యస్. సి. యస్. పి. 40.00 లక్షలు. ఏ.సి.డి.పి. 40.00 లక్షలు సి.ఏం. అస్సూరెన్స్ గ్రాంట్. 1000.00 లక్షలు. మొత్తం కాపిటల్ గ్రాంట్స్ 2205.00 లక్షలు. చార్జ్‌డ్ ఎక్సపెండిచర్ రూ. 1537.96 లక్షలు ఇతర నిర్వహణ వ్యయం. రూ. 296.60 లక్షలు 1/3 బ్యాలన్స్ బడ్జెట్ రూ. 42.00 లక్షలు ప్రజా సౌకర్యాల కోసం బడ్జెట్ రూ. 58.90 లక్షలు వార్డుల వారీగా పనులు రూ. 66.00 లక్షలు. మొత్తం బడ్జెట్ (ఏంజిఎఫ్ మరియు సిపిఎఫ్) రూ. 4177.65లక్షలు. మిగులు బడ్జెట్ రూ. 2.05 లక్షలు. ఈ బడ్జెట్ 2024-25 సంవత్సరమునకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించనైనది. ఈ సమావేశంలో వైస్-చైర్మన్ బాబర్, కౌన్సిల్ సభ్యులు, గౌరవ కో-ఆప్షన్ మెంబర్స్, మున్సిపల్ డీ.ఇ.ఇ. సందీప్ వరల్డ్, మేనేజర్ ఎల్లారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# సార్లపల్లి పునరావాసాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దాలి

### - జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్



**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** నల్లమల్ల అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాంతాల్లోని సార్లపల్లి గ్రామ తరలింపు ప్రక్రియకు ఎలాంటి ఒత్తిడి లేకుండా గ్రామ సభలో తీర్మానించి ,సుముఖతం వ్యక్తం చేసిన 186 కుటుంబాల పునరావాసానికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ అధ్యక్షతన అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కె సీతారామారావు, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, అమ్రాబాద్ కోర్ ఏరియాలో నివసించే గ్రామ వాసుల కోసం స్వచ్ఛంద గ్రామ పునరావాసం కోసం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టైగర్ రిజర్వ్ ప్రాంతం నుండి స్వచ్ఛందంగా తరలి వెళ్లేందుకు ముందుకొచ్చి ప్రతిపాదించిన సార్లపల్లి గ్రామ పునరావాసం ఒక మాడల్‌గా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకొంటూ పనులు త్వరగా పూర్తి చేయాలనిఅధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. టైగర్ రిజర్వ్ నుంచి గ్రామ

మిగతా 2లో

# సంక్షేమ పథకాల అమలుకు సమన్వయంతో కృషి చేయాలి

### - జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ




**నారాయణపేట మేజర్‌న్యూస్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని నారాయణపేట జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి లో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పి చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు తమ తమ మండలాల పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. ఉట్కూరు జెడ్పిటిసి సభ్యులు అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా కొంతమంది రైతులకు రైతుబంధు నగదు జమ కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ ను ప్రశ్నించగా ఈ నెలాఖరు వరకు రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో జమ అవుతుందని జాన్ సుధాకర్ తెలిపారు. రైతుబంధు సాయం ఎన్ని ఎకరాల వరకు కట్ చేసే అవకాశం ఉందని కో ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్ అడగగా

మిగతా 2లో

సూర్య
www.suryaa.com
శనివారం
17 ఫిబ్రవరి 2024

## ఆశలన్నీ రేవంత్‌పైనే

(మొదటిపేజీ తరువాయి)

పార్టీనేతలు అంటున్నారు. ఇదిలా ఉండగా అధికారం చేపట్టిన తరువాత మొట్టమొదటిసారిగా సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి పర్యటిస్తుండడం ప్రధాన్యత సంతరించుకుంది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ జిల్లాకు సిఎం రేవంత్‌రెడ్డి ఇన్‌ఛార్జ్‌గా ఉండడంతో కాంగ్రెస్ నాయకులు సిఎం పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఈ ప్రాంత రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ జిల్లాకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రి కావడంతో ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి అయితాయి అని వారు భావిస్తున్నారు. కల్వకుర్తి, మెట్టెంపాడు, భీమ, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులతో పాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఆయకట్టు రైతులు గంపెడంత ఆశలు పెంచుకున్నారు. ఎన్నోఎళ్ళుగా పూర్తిగాని సాగునీటి ప్రాజెక్టులు ఈసారైన నిధుల కొరత లేకుండా పూర్తిచేసేందుకు ముఖ్యమంత్రి సహకరిస్తారని రైతులు ఆశాభావంతో ఉన్నారు. ఇక్కడ జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో సిఎం రేవంత్‌రెడ్డి జిల్లా ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ ఇస్తారు అని అందరు భావిస్తున్నారు. అదేవిధంగా నారాయణపేట జిల్లాలో నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాలకు సాగునీటిని అందించే నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసేందుకు తగు ఆదేశాలు ఇస్తారని పేట వాసులు ఆసక్తితో ఉన్నారు. ఇందులో భాగంగా జాయమ్మ చెరువును నీటితో నింపి ఈ ప్రాంత రైతులకు సాగునీటి అందిస్తారు అని ఆశిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు జిఓ నెం. 69 అమలుచేస్తారని ఇటు అధికారులు, అటు ప్రజా ప్రతినిధులు ఎదురు చూస్తున్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి పీఠం అధిష్టించిన తర్వాత సిఎం రేవంత్ రెడ్డి హుండా, ముడా తరహాలో కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కోసం ప్రతేకంగా కాడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి అధికారులు కూడా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కోస్గి పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాలలో యూనివర్సిటీని ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన సంగతి కాంగ్రెస్ నాయకులు గుర్తు చేస్తున్నారు. ప్రత్యేకంగా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాలు శరవేగంగా అభివృద్ధి జరిగే అస్కారం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## కమలం టార్గెట్ పాలమూరు

(మొదటిపేజీ తరువాయి)

విజయ సంకల్పయాత్రలో భాగంగా 21 అసెంబ్లీ నియోజకవర్గాలు కవర్ అయ్యేలా 926 కిలోమీటర్ల దూరం వరకు విజయ సంకల్పయాత్ర కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలే లక్ష్యంగా ఈ యాత్ర జరుగుతుందని తెలిపారు. విజయ సంకల్ప యాత్రలో బిజెపి జాతీయ ఉపాధ్యాక్షురాలు డికె అరుణ, కార్యవర్గ సభ్యుడు ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ తదితరులు పాల్గొంటున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

## సార్లపల్లి పునరావాసాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దాలి

(మొదటిపేజీ తరువాయి)

తరలింపు పురోగతి పనులపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సార్లపల్లి గ్రామంలో 186 కుటుంబాలను గుర్తించగా అందులో 85 కుటుంబాలు 15 లక్షల పరిహారం తీసుకోనున్నట్లు వారు గ్రామసభలో వెల్లడించారని, మిగిలిన 101 కుటుంబాలకు బాకారం సమీపంలో ఒక్కో కుటుంబానికి 220 గజాల ఇంటి నిర్మాణానికి స్థల కేటాయింపుతో పాటు వ్యవసాయ జీవనోపాధికై ప్రతి కుటుంబానికి 5 ఎకరాల వ్యవసాయ భూమిని ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంటి స్థలం కోసం కేటాయించిన ప్రాంతా అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అందుకు కావలసిన నిధులు అటవీ శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పునరావాసం కోసం కేటాయించిన ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం త్రాగునీరు విద్యుత్ సౌకర్యం, అంగన్వాడి కేంద్రం ,ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ భవనం నిర్మాణాలకై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.రక్షిత అటవీ ప్రాంతాలు, పులుల ఆవాసాలను మరింత అభివృద్ధి చేయాలని, అడవుల్లో జనసంచారం, పెంపుడు జంతువుల ద్వారా తలెత్తే సమస్యలను తగ్గించటమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం సార్లపల్లి గ్రామ ప్రజలతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు . సార్లపల్లి గ్రామ ప్రజల ప్రతిపాదనలను కలెక్టర్ సానుకూలం గా విన్నారు .అనంతరం సంబంధిత శాఖ అధికారులకు వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేసించినారు. పునరావాస కేంద్రంలో ఏర్పాటు పనులపై గ్రామ ప్రజల సంతృప్తి వ్యక్తం చేసి పునరావాసనికి తరలి వెళ్లేందుకు అంగీకరించారు.గ్రామ ప్రజల పలు రకాల ప్రతిపాదనలను కలెక్టర్ ఈ సందర్భంగా అంగీకరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కె సీతారామారావు, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ షాప్ ప్రారంభోత్సవానికి హాజరైన కౌకుంట్ల మండల మైనార్టీ అధ్యక్షులు

**కౌకుంట్ల మేజర్ న్యూస్:** మహబూబ్నగర్ జిల్లాలో హమీద్ జవెల్లర్స్ గోల్డ్ షాప్ ప్రారంభోత్సవానికి హాజరై అభినందనలు తెలిపిన కౌకుంట్ల మండల మైనార్టీ అధ్యక్షులు ఎండి నజీర్. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నీలి నరసింహులు, అఖిల్, సత్యం, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుకు సమన్వయంతో కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం రైతు భరోసా పథకానికి సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందిస్తుందని, ప్రస్తుతానికి గత సీజన్లో మాదిరిగానే రైతులకు నగదు సాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేస్తుందని జాన్ సుధాకర్ తెలిపారు. దామరగిద్ద ఎంపీపీ బక్క నరసప్ప మాట్లాడుతూ దామరగిద్ద లో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటుతున్నారని, తీగల కింద కాకుండా వాటి పక్కలో మొక్కలు నాటాలని కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయబోయేగృహ జ్యోతి పథకానికి 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ఏదైనా రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు అర్హులని, ఇప్పటికే లక్ష మందిలో 65 వేల మంది కి గృహ జ్యోతి పథకం అమలు కోసం లింకప్ చేయడం జరిగిందని, మిగతా వారికి కూడా లింక్ ఆఫ్ చేస్తామని చెప్పారు. గృహ జ్యోతి పథకాన్ని ప్రతి ఒక్కరికి అమలు చేయాలని జెడ్పిటిసి సభ్యులు అశోక్ కోరారు. రేషన్ కార్డు లేని వాళ్ళు గృహ జ్యోతి పథకానికి అర్హులు కారా అని మాగనూరు జడ్పిటిసి వెంకటయ్య ప్రశ్నించగా, స్పందించిన విద్యుత్ శాఖ అధికారి గైడ్లైన్స్ ప్రకారం రేషన్ కార్డు తప్పనిసరి అని, రేషన్ కార్డు లేని వాళ్ళు కొత్త రేషన్ కార్డు తీసుకున్న తర్వాత గృహ జ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నర్వ జడ్పిటిసి సునీత మాట్లాడుతూ ఇటీవల చిన్నపిల్లలో గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయని, మండలాల వారిగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గుండెపోటు నివారణ పై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. దామరగిద్దలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మింప చేసిన ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలను కొనసాగించాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, రోగులకు వైద్య సేవలు సమయానికి అందడం లేదని, చిన్న రక్త గాయంతో ఆస్పత్రికి వెళ్తే మహబూబ్ నగర్ కు రెఫర్ చేస్తున్నారని సభ దృష్టికి తీసుకురాగా, స్పందించిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంజిత్ కుమార్ వైద్య సేవలు అందిస్తున్నందుకే జిల్లా ఆసుపత్రి పనితీరు (ఫర్ఫామెన్స్) రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఆస్పత్రిలో తాము మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఊట్కూరు, మక్తల్, మాగనూరు ఎంపీపీలు తమ మండలాల పరిధిలో తాగునీటి సమస్య నెలకొందని, వేసవికాలంలో సమస్య మరింత జఠలమయ్యే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మద్దూర్ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థాయిలో బోర్లు వేసేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... ఎంపీపీలు, జడ్పిటిసిలు తమ ఈ పదవి కాలంలో అభివృద్ధి పనుల విషయంలో జిల్లా అధికారులకు సహకరించారని, జిల్లా అధికారుల తరపున అందరికీ శుభాభినందనలు తెలిపారు. ఇక తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ వారిగా మిషన్ భగీరథ ఎంట్రా సిబ్బందితో పనులు చేయించు కోవచ్చని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన రెండో దఫా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ, షెడ్యూల్ కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా ముఖ్య ప్రణాళిక, గనులు భూగర్భ శాఖ, చేనేత జోలి శాఖ, ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ, పౌర సరఫరాల శాఖ, దేవాదాయ శాఖ, వెనక బడిన తరగతులు సంక్షేమ శాఖ, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు తమ తమ పరిధిలోని ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో శైలజ, డిప్యూటీ సీఈఓ జ్యోతి, ఆయా ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, జెడ్పీ కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం పై ప్రజలకు అవగాహన కల్పించాలి : కలెక్టర్



**నారాయణపేట మేజర్‌న్యూస్:** సంప్రదాయ చేతి వృత్తుల వారిని, హస్తకళాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ, వారి యొక్క నైపుణ్యాలను పెంపొందిస్తూ ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు పీ.ఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రంలోని షీలా గార్డె న్ లో శుక్రవారం ఎంఎస్ఎంఈ.మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ అభివృద్ధి కార్యాలయం, హైదరాబాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం, నారాయణపేట సహకారంతో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సదస్సును కలెక్టర్ కోయశ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాయంక్ మిత్తల్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. గ్రామీణ, పట్టణ ప్రాంతానికి చెందిన అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనేక ప్రయోజనాలతో కూడుకుని ఉన్న పీ.ఎం విశ్వకర్మ పథకం గురించి గ్రామగ్రామాన విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరు ప్రయోజనం పొందేలా చొరవ చూపాలని ఎంపీడీవోలు, ఎంపీఓ లు, పంచాయతీ కార్యదర్శులు, కామన్ సర్వీస్ సెంటర్ (సి.ఎస్.సి) ఆపరేటర్లు, విశ్వకర్మలకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సదస్సులో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామ సుబ్బారెడ్డి, ఎం.ఎస్.ఎం.ఈ అధికారి శ్రీనివాస్ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణమాచారి, డి ఎల్ పి ఓ సుధాకర్ రెడ్డి, లీడ్ బ్యాంకు అధికారి విజయ్ కుమార్, డొమైన్ ఎక్స్ పర్ట్ లు పగుడాకుల శ్రీనివాస్, కావలి వెంకటయ్య, జిల్లాకు చెందిన ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, పంచాయతీ కార్యదర్శులు, విశ్వకర్మలు తదితరులు పాల్గొన్నారు.

## చింతరేవుల ఆంజనేయస్వామి జాతర మహోత్సవాలలో పాల్గొన్న జెడ్పి చైర్ పర్సన్ సరిత





**ధరూర్ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి జాతర మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ హాజరై స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు... తీర్థప్రసాదాలు స్వీకరించారు... అనంతరం జాతర మహోత్సవంలో భాగంగా గ్రామస్థులు ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను జెడ్పి చైర్ పర్సన్ సరితమ్మ చేతులమీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.. ఈ కార్యక్రమం ఉద్దేశించి సరితమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గత ప్రభుత్వంలో క్రీడలకు సరైన ప్రాధాన్యత లేకపోవడం వలన క్రీడాకారులు నిరుత్సాహనికి గురయ్యారు...తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో నుంచి జాతీయ స్థాయి వరకు అని రకాల క్రీడలకు ప్రోత్సాహం అందించి అని విధాలుగా సహకారం అందిస్తామని సరితమ్మ అన్నారు... జాతర మహోత్సవంలో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించడంతో గ్రామీణ ప్రాంతాలలో స్నేహ సంబంధాలతో పాటు శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంజిపెట్ శంకర్,ఓబిసి అధ్యక్షుడు నల్లారెడ్డి,నాయకులు మాజీ సర్పంచ్ పద్మ రామాంజనేయులు,చిన్నపాడు ఆంజనేయులు,బండ్ల వెంకటేశ్వర రెడ్డి, శ్రీ కాంత్ రెడ్డి,జమ్మిచేడు ఆనంద్,నరేందర్ రెడ్డి, గార్లపాడు మల్లేష్, గౌని హన్మంతు, రాఘు,దామోదర్ రెడ్డి, రవి,గీతారెడ్డి,దీనేష్,కరాటే సత్యం,కొత్త గణేష్, చింతరేవుల సురేష్, తోట రాముడు, బీసన్న తదితరులు ఉన్నారు.

## విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యుత్ ఉద్యోగులు



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన సమయంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (%చీజజూజుజుజు%) ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ బిల్లు 2022 కు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా , సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల సామూహిక పోరాటానికి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ముఖ్య కార్యాలయం దగ్గర , జిల్లాలోని ముఖ్య కార్యాలయాల దగ్గర మధ్యాహ్న భోజన సమయంలో నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా వనపర్తి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం దగ్గర విద్యుత్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో 1104 యూనియన్ నాయకులు బాల ప్రతాప్ , వెంకటేష్, 327 యూనియన్ నాయకులు ,ఏఈ లు , సబ్ ఇంజనీర్లు, విజయ్ కుమార్ ఏఏవో, ఈఆర్వో వనపర్తి, ఎస్ఈ ఆఫీస్, డివిజన్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్‌ల వితరణ




**నాగర్‌కర్నూల్, మేజర్‌న్యూస్:** నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి శ్రీ కృష్ణా కాటన్ మిల్ ఆవరణలో తాడూర్ మండలంలోని ఆరు గ్రామాలు సిర్సవాడ, భల్లాన్‌పల్లి, గోవిందాయిపల్లి, అంతారం, ఐతోల్, ఏటిదర్ పల్లి ప్రభుత్వ పాఠశాలలు మరియు నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, గడ్డంపల్లి ఉన్నత పాఠశాల లకు ముఖ్య అతిధిమాజీ గవర్నర్ రాధాకృష్ణ చేతుల మీదుగా అందజేసారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ గవర్నర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఎండాకాలం సమీపిస్తున్న సమయం లో మంచి నీటి నిల్వ కొరకు వాటర్ ట్యాంక్‌లు వితరణ చేయడం అభినందించ దగ్గ విషయం అని క్లబ్ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి ని అభినందించారు. ఈ కార్యక్రమం లో క్లబ్ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, మాజీ గవర్నర్ రాధా కృష్ణతో పాటు మాజీ మార్కెట్ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు హకీం విశ్వ ప్రసాద్, కార్యదర్శి అమరేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు రాచూరి వెంకటరాజ,లగిశెట్టి కోదండ రాములు,తెప్ప శ్రీను, ప్రేమకుమార్‌రెడ్డి, సభ్యులు వెంకట కృష్ణారెడ్డి, ఆయా పాఠశాల ల ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్, గోవింద రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రదీప్ కుమార్,లక్ష్మణ్, రాజవర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం పాఠశాలల ప్రతినిధులు అధ్యక్షులు రామకృష్ణ రెడ్డిని శాలువాతో సన్మానించారు.

## ఆర్ కృష్ణయ్యను కలిసిన బీసీ సంఘం నాయకులు



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యను హైదరాబాదు లోని ఆయన నివాసంలో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, ఉమ్మడి పాలమూరు జిల్లా నాయకులు రాములు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలో నెలకొన్న బీసీ సమస్యలు, లోకసభ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం పైన సుదీర్ఘంగా చర్చించినట్లు పెద్దయ్య యాదవ్ తెలిపారు, రాష్ట్రంలో బీసీ అభ్యర్థుల గెలుపు కోసం బీసీ సంఘాలు విస్తృతంగా పనిచేయాలని ఆర్ కృష్ణయ్య సూచించడం జరిగిందని పేర్కొన్నారు, ఆర్ కృష్ణయ్య స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో ఆయన యోగ యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు, బీసీసంఘం నాయకులు ఉన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**వంగూరు మేజర్‌న్యూస్:** ఉల్పర గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సయ్యద్ ఇమ్రాన్ అహ్మద్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గువ్వల బాలరాజు గురువారం రాత్రి పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుని కుటుంబానికి ప్రభుత్వ పరంగా సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నిత్యావసర ధరలు నియంత్రించాలి : టీఎస్‌యుటిఎఫ్



**పాలమూరు మేజర్ న్యూ స్ :** సిపిఎస్ విధానాన్ని దానికి మూలమైన పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలపింగ్ అథారిటీ చట్టాన్ని రద్దు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలు నియంత్రించాలని టీఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో మహబూబ్నగర్ రూరల్ మండలంలోని మణికొండ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి చేపట్టిన నిరసనలో డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను స్లాబులు సవరించాలని, వేతన జీవులు ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహమాన్ మాట్లాడుతూ జి.ఎస్.టి. కారణంగా నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని, ధరలు తగ్గించి ప్రజలకు మేలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సవిత,కళ్యాణి, శ్రీరాములు, మధుసూదన్, మత్సంధర్, దీప్తి, జగదీశ్, శ్రీనివాసులు, అరుణ, శివకుమారి, రాధమ్మ పాల్గొన్నారు.

# వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం

**- టిఆర్ఎస్ నాయకులకు ఘాటుగా సమాధానం చెప్పిన కాంగ్రెస్ ఎంపీటీసీ**

**- అధికారులు నివేదికలు చదవడమే కానీ సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని సభ్యుల ఆందోళన**




**బిజినపల్లి మేజర్‌న్యూస్:** 90 రోజులకు ఒకసారి నిర్వహించి మండలంలోని సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులతో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది శుక్రవారం ఇంచార్జ్ ఎంపీడీవో కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు తూతూ మంత్రంగా నివేదికలు చదివి వినిపించడంతో సభ్యులు ఆందోళనకు దిగారు మూడు నెలలకు ఒకసారి నిర్వహించ సమావేశంలో అధికారులు నివేదికలు చదువుతున్నార తప్ప సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ఆందోళనకు దిగారు అంతకుముందు ఆర్టీసీ పైన నిర్వహించిన సమీక్ష లో ఆర్టీసీ బస్టాండ్ లో కనీస వసతులు లేవని ఎంపిటిసి మంగి విజయ్ అధికారులను నిలదీశారు బస్టాండ్లో ప్రయాణికులకు కనీస అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని మళ్లీ జరగబోయే సమావేశంనాటికి అన్ని వసతులు కల్పించాలని లేనియెడలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు అనంతరం జరిగిన సమావేశంలో విద్యుత్ సమస్యల పైన టిఆర్ఎస్ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ కరెంటు సమస్యలు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని 90 రోజులలో పథకాలను ప్రారంభిస్తామని నేటికీ ప్రారంభించలేదని పేర్కొనడంతో కలగజేసుకున్న కాంగ్రెస్ ఎంపీటీసీ అంజి మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కూడా గడవలేదని అప్పుడే విమర్శించడం తగదని పది సంవత్సరాలు మీరు ఏమి అభివృద్ధి చేశారు చూపించాలని సవాల్ విసిరారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నిటిని నెరవేరుస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

## అధికారుల తీరుకు నిరసనగా ధర్నా నిర్వహిస్తున్న ముంపు గ్రామ యువకుడు



**రేవల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గల బండరాయి పాకుల గ్రామం ఏదుల ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఇందులో భాగంగా బండరాయి పాకుల గ్రామంలో సుకుమార్ రెడ్డి అనే వ్యక్తి ఇల్లు, భూమి ప్రాజెక్ట్ కు ముంపు గురైంది, తనకు రావలసిన పరిహారాలు ఏవి కూడా రాలేదు అని అందుకు ప్రభుత్వానికి తెలిసే విధంగా తను ధర్నా కార్యక్రమం మొదలుపెట్టారు. సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ముంపు పునరావాసం కింద ప్రభుత్వం అతనికి నష్టపరిహారం 2019లో 12లక్షల 54వేల రూపాయలు తన పేరు మీద ప్రభుత్వం కేటాయించిన, తనకు మాత్రం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా పడలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గత ప్రభుత్వంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు గ్రామానికి సంబంధించి 129 మంది పైన కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఇందులో కొంత మంది కి అర్హత లేకున్నా డబ్బులు వచ్చాయి అని ,కొంత మంది ఇతర గ్రామస్తులని, కాగా మిగతా 12 మంది తమ గ్రామస్తులే అని సర్వేలో తేలడంతో వారికి అర్హత ఉంది అని వారికి డబ్బులు మంజూరు చేయాలని అప్పటి అధికారులు సూచించారు,కాగా ఈ 12 మందిలో నాయకుల అనుకూలంగా ఉన్నా 8 మందికి డబ్బులు రావడం జరిగిందని, కానీ మిగతా మా నలుగురికి పడలేదని, ఈ విషయమై అప్పటి నుంచి వనపర్తి జిల్లా కలెక్టర్ దగ్గరకు 36 నెలలుగా తిరుగుతున్న కూడా పునర్వాసం డబ్బులు ఇవ్వడం లేదని, కొంతమంది వ్యక్తులకు అర్హత లేకపోయినా వాళ్లకు అమౌంటు ఇచ్చారని, మా అన్ని అర్హత కలిగిన ప్రూఫ్స్ ఉన్న ఇవ్వడం లేదు. ఈ విషయంలో అధికారుల ను సంప్రదించగా తన సి ఫామ్ లేదని అంటున్నారు అని ,తన సీ ఫామ్ ను గ్రామపంచాయతీ దగ్గర నుంచి ఎవరు మాయం చేశారు దానిమీద ఎంక్వయిరీ చేయాలని, వారిపై చర్యలు తీసుకొని ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగు నెలల క్రితం కలెక్టర్ కార్యాలయం అధికారులను సంప్రదించగా అసెంబ్లీ ఎన్నికల తర్వాత అని చెప్పారు అని ,ఇప్పుడు వెళ్తే మళ్ళీ ఎన్నికల సమయం అని తర్వాత చేస్తామని చెప్తున్నారు అని అధికారుల తీరుకు నిరసన గురువారం నుంచి ధర్నా చేస్తున్నానని చెప్పారు. తనకు ఫ్లాటు, డబ్బులు వచ్చేవరకు పాత ఊర్లోనే ఉంటానని, తనకి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన అన్ని రుజువులు తన దగ్గర ఉన్నాయి అని ,తనకు న్యాయం జరిగే వరకు అధికారులే రక్షణ కల్పించాలని,అప్పటి వరకు తానొక్కడినే ధర్నా కొనసాగిస్తానని సుకుమార్ రెడ్డి చెప్పారు.

## విజేతలకు బహుమతులు అందించిన సంకాపురం రాముడు



**అయిజ రూరల్‌న్యూస్:** శుక్రవారం అయిజ మండలం ఉత్తనూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ ధన్వంతరి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా గురువారము శుక్రవారం జరిగిన నాలుగు పళ్ళ విభాగం వృషభరాజములు బల ప్రదర్శన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఐదుగురుకు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శంకపురం రాముడు దాదాపు 85 వేల రూపాయలను సంకపురం రాముడు విజేతలకు అందజేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గ్రహీత కొండన్న చింతరేవుల గ్రామం నుండి నల్లారెడ్డి రాయపురం గ్రామం, రెండవ బహుమతి గ్రహీత షాలి మేడం అలగనూరు నంద్యాల ఏ చిన్న రత్నం బీతాండపడు కర్నూలు, మూడో బహుమతి గ్రహీత శీలం జగన్మోహన్ రెడ్డి కేశవపురం భీంపురం మఠం కడప, నాలుగో బహుమతి గ్రహీత శ్రీనివాస్ యాదవ్ వనపర్తి పెద్దింటి రామసుబ్బారెడ్డి పోలూరు నంద్యాల, ఐదో బహుమతి గ్రహీత ఏ గురునాథ్ కొత్తకోట డోన్‌గా బహుమతులు అందుకున్నారు. ఈ ఉత్సవంలో ప్రజాప్రతినిధులు మాజీ అధికారులు భక్తులు రాముడన్న సైన్యం సభ్యులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పిల్ల చదువులకు కోరకు కొంత జీతంను ఫైనాన్షియల్ ప్లానింగ్ చేసుకోవాలి

**- సాయుధ దళ డి.ఎస్పీ నరేందర్ రావు**



**గద్వాల మేజర్ న్యూస్:** పోలీస్ సిబ్బంది విది నిర్వహణతో పాటు తాము పొందే జీతాలతో కుటుంబ భవిష్యత్, పిల్ల చదువులకు కోరకు కొంత జీతం ను ఫైనాన్షియల్ ప్లానింగ్ చేసుకొని సేవింగ్ %డ% ఇన్వెస్ట్మెంట్ కుడా చేసుకోవాలని సాయుధ దళ డి.ఎస్పీ నరేందర్ రావు పోలీస్ సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్పీ రితిరాజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని గ్రీవెన్స్ హాల్‌నందు కార్యాలయ సిబ్బందికి, సాయుధ దళ సిబ్బందికి, గద్వాల్ సర్కిల్ సిబ్బందికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హైదరాబాద్ వారితో ఫైనాన్షియల్ ప్లానింగ్ మీద సేవింగ్ , ఇన్వెస్ట్మెంట్ గురించి అవగహన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది తమకు వచ్చిన జీవితంలో కొంత అమౌంట్‌ను ముచువల్ ఫండ్‌లో భాగమైన సిస్టమాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్, పబ్లిక్ ప్రోవైడెంట్ ఫండ్స్‌లలో ఇన్వెస్ట్మెంట్ చేయటం ద్వారా పొందే ప్రయోజనాల గురించి తెలియజేశారు. పిల్లల చదువులకు, భవిష్యత్ కు ఉపయోగపడే ఇన్వెస్ట్మెంట్ ల గురించి, సొల్యూషన్ ఓరియెంటెడ్ %డ% ఇతర స్కీమ్స్ గురించి, మొడ్స్‌ఆఫ్ ఇన్వెస్ట్మెంట్ గురించి అవగహన కల్పించారు. ఈ సంధర్భంగా సాయుధ దళ డి.ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ పిల్లల భవిష్యత్ ను, రాబోయే రోజులలో ఖర్చులను, రిటైర్మెంట్ తరువాత అవసరమయ్యే డబ్బును దృష్టిలో ఉంచుకుని తమకు వచ్చే జీతం లో కొంత అమౌంట్ ను ఫైనాన్సియల్ ప్లానింగ్ చేసుకొని ఇన్వెస్ట్మెంట్ చేసుకోవడం ద్వారా తమ కుటుంబాలు భవిష్యత్ లో ఆర్థిక సమస్యల రాకుండా అధిగమించవచ్చు అనీ అన్నారు . జిల్లా ఎస్పీ పోలీస్ సిబ్బంది సంక్షేమం ను దృష్టిలో ఉంచుకొని వారు వారి కుటుంబ సభ్యుల భవిష్యత్ కోరకు వచ్చిన జీతం ను వృదా ఖర్చులు చేయకుండా కొంత డబ్బును వివిధ ఫండ్స్ లలో ఇన్వెస్ట్మెంట్స్ పెట్టడం ద్వారా భవిష్యత్ లో ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వివిధ బ్యాంక్‌ల వారితో అవగాహనా సదస్సు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏ.ఓ సతీష్, హెచ్డీఎఫ్సి హైదరాబాద్ ముచువల్ ఫండ్స్ మేనేజర్ నిఖిల్, అసిస్టెంట్ మేనేజర్ అనిల్ ,సాయుధ దళ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖ డ్రీమ్ ఫౌండేషన్ వారి సహకారంతో సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** మహబూబ్నగర్ జిల్లా విద్యాశాఖ డ్రీమ్ ఫౌండేషన్ వారి సహకారంతో కౌకుంట్ల మండల కేంద్రంలో వివిధ పాఠశాలల ఆరు నుండి పదో తరగతి తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం విద్యార్థినీ విద్యార్థులు, మీడియంకు ముగ్గురు చొప్పున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఇంచార్జ్ హెడ్మాస్టర్ సునీత మేడం తో విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. ఉపాధ్యాయులు కే అనిల్ కుమార్, కే సునీత, పేరుర్ అప్పంపల్లి కె శ్రీనివాసులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## గద్వాల డి.ఎస్.పిగా కే సత్యనారాయణ



**గద్వాల మేజర్ న్యూస్:** రాష్ట్ర వ్యాప్త బదిలీలలో భాగంగానే జిల్లాకు డి ఎస్పీగ వచ్చిన కె .సత్యనారాయణ ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రితిరాజ్, ఐపీఎస్‌ని పూల మొక్కతో మర్యాద పూర్వకంగా కలిసి డిఎస్పీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

## కరాటే విద్యార్థికి ఘన సన్మానం



**పాలమూరు మేజర్ న్యూస్ :** కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన జీకే మాస్టర్ షోటోకాన్ బ్లాక్ బెల్ట్ కరాటే విద్యార్థి అఖిలేశ్వర్ రెడ్డిని శుక్రవారం జిల్లా, కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.క్రిష్ణయ్య మాట్లాడుతూ తమ షోటోకాన్ విద్యార్థి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల పోలీస్ ఉద్యోగాలకు సంబంధించిన ఫిట్ నెస్ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అలీముద్దీన్, పవన్, కళ్యాణ్, రిశ్విత్ పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**జడ్చర్ల మేజర్‌న్యూస్:** జడ్చర్ల మండలం కొండేడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులే ఉపాధ్యాయు లుగా మారి సహ విద్యార్థులకు విద్యాబోధన చేసి ఆకట్టు కున్నారు. హెచ్‌ఎంగా జయంత్, పీఈటీ మహేష్, అవంతిక, సౌజన్య, భాగ్య భవ్యశ్రీ, శివప్రసాద్, దీక్షిత్ తదితర విద్యార్థులు ప్రధానోపాధ్యాయులతో పాటు వివిధ సబ్జెక్టు టీచర్లుగా విద్యాబోధన అందించారు. ముగింపు వేడుకలో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, ఉపాధ్యాయురాలు శారద పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**గోపాలపేట మేజర్ న్యూస్ :** గోపాలపేట మండలం పోలికే పహాడ్ గ్రామానికి చెందిన చాకలి కలవరాల నరసింహ మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి ఆర్థిక సహాయం కింద 5000 రూపాయలు పంపించగా కాంగ్రెస్ నాయకులు కుటుంబానికి అందజేశారు గ్రామానికి చెందిన నర్సింహ మృతి చెందడంతో గోపాల్పేట రేవల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సత్యశీల రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో మానవతా దృక్పథంతో స్పందించి ఆ రూపాయలను పంపించగా కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

## ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం



**తెలకపల్లి మేజర్ న్యూస్ :** తెల్కపల్లి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గౌరెడ్డిపల్లి పాఠశాల శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కె. వైష్ణవి ప్రధానోపాధ్యాయురాలిగా కె. లాల్ కుమార్, ఆర్జేడీగా వి శ్వేత, జిల్లా కలెక్టర్‌గా కె పావని, జాయింట్ కలెక్టర్‌గా పి పుష్పలత, వ్యవహరించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా విద్యాధికారి ఎం గోవిందరాజులు మరియు ఏఎంవో షర్ఫుద్దీన్ ఉత్తమంగా బోధించిన వారికి బహుమతులను అందించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం మల్లికార్జున్ మరియు ఉపాధ్యాయులు లక్ష్మీనరసింహా రెడ్డి, వెంకటేష్, తేజ్యా, శివప్రసాద్, నర్సింహులు, రామకృష్ణ, మధుసూధన్ రెడ్డి, కృష్ణయ్య, రవీందర్, బాలయ్య, రంజిత్, రమాదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ డ్రైవర్‌గా జయరాములు



**పెద్దమందడి, మేజర్ న్యూస్:** వనపర్తి ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించే జయరాములు (% జు% 150094)కు బెస్ట్ డ్రైవర్ గా ఎంపికయ్యారు. పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన జయ రాములు గత 27 సంవత్సరాల 6 నెలలుగా ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ సురక్షిత డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికులకు సురక్షితమైన సుఖాంతమైన ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఈ మేరకు శుక్రవారం ప్రమాదరహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి ఆర్టీసీ డిపోలో ఆయనకు డిఎం వేణుగోపాల్ , సిఐ దేవేందర్ గౌడ్, మహిళా డిగ్రీ కళాశాల లెక్చరర్ దామోదర్ రెడ్డి సహచర కార్మికులు శాలువా తో ఘనంగా సన్మానించారు. 1996లో వనపర్తి ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా బాధ్యతలు చేపట్టి నేటికీ ప్రయాణికులకు గాని బస్సులకు గాని ఎలాంటి ప్రమాదం కల్పించకుండా సురక్షిత డ్రైవింగ్ చేశాడని డిపో మేనేజర్ వేణుగోపాల్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అయిజలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్స్ నియమాకం



**అయిజ మేజర్ న్యూస్ :** ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన పార్టీలు తమ నాయకులను పటిష్టంగా చేసుకునేందుకు రకరకాల వ్యూహాలను పన్నుతున్నారు అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బూతులు ఏజెంట్స్ సమావేశం శుక్రవారం రోజు అయిజలో జరిగింది. ఐజ పట్టణంలోని 26 పోలింగ్ బూత్‌లకు కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు స్థానిక పాత బస్టాండ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూతులు ఏజెన్సును నియమించడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి ఆదేశాలతో చేస్తున్నట్లు టిపిసిసి అధికార ప్రతినిధి మాస్టర్ శిక్షావలి ఆచారి అన్నారు. అనంతరం శిక్షావల్లి మాట్లాడుతూ బూతులు ఏజెంట్స్ అనుకున్న స్థాయిలో పనిచేయాలని పార్టీ బలోపేతంకు కృషి చేయాలని పార్టీ మీపైన పెట్టుకుని నమ్మకాలను మీరు విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాస్టర్ మధు కుమార్, కౌన్సిలర్ రాణమ్మ, మద్దిలేటి, సాంబశివుడు, పాండురంగ, నరసింహులు, చెన్నప్ప, శివరాజు, దూద్ బాషా, మహేంద్ర, ఈరన్న, తిరుమలేష్ ఆచారి, కొండ, రాముడు, అనిల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

## మర్యాదపూర్వకంగా సంపత్ కుమార్‌ను ఎస్సై

**అయిజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణంలో శుక్రవారం నూతన ఎస్సైగా విజయ్ భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఐజలో శాంతి భద్రతలను కాపాడుతానని ప్రజలు సహకరించాలని అన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని అతిపెద్ద మండలంలో ఉన్న ఐజకు నాకు బదిలీ కావడం అనేది చాలా సవాల్ గా కాకుండా ఇష్టంగా ఉంది అని పోలీసు వృత్తిలో ఉంటూ ఇక్కడి ప్రజలకు సేవ చేయడం అనేది మా యొక్క కలలాంటిది అని అన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణం



**గోపాలపేట మేజర్ న్యూస్:** గోపాలపేట మండలంలో రథసప్తమి పండుగని శుక్రవారం నాడు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణం వైభవంగా సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు పూజారులు సుందరాచార్యులు రంగాచార్యులు గోపికృష్ణ ఆచార్యులు భక్తులు పాల్గొన్నారు.

## భారత ప్రభుత్వానికి అభినందనలు



**వడ్డేపల్లి మేజర్ న్యూస్:** భారత ప్రభుత్వం మధ్యప్రదేశ్ కు చెందిన ఉజ్జయిని పిఠాధిపతి వాల్మీకి సమాజ్కు చెందిన ఉమేష్ నాథ్ మహారాజ్ గురూజీకి రాజ్యసభకు ఎన్నిక చేసి న శుభ సందర్భంగా వడ్డేపల్లి మండల గ్రామాల బోయ వాల్మీకులు భారత ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఒకరిని ఒకరు స్వీట్లు నోట్లో తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోయ వాల్మీకులు పాల్గొన్నారు.

## నూతన డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జె.వెంకటేశ్వర రావు



**వనపర్తి క్రైమ్, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో సాధారణ బదిలీలలో భాగంగా వనపర్తి డిఎస్పీ ఆనంద రెడ్డి బదిలీకావడంతో వనపర్తికి నూతన డిఎస్పీగా జె. వెంకటేశ్వరరావు బదలీపై నారాయణపేట డిసీఆర్‌బీ నుండి వనపర్తికి డిఎస్పీగా బదిలీపై వచ్చారు. జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి కలిశారు. వనపర్తి డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ సమస్యలు పరిష్కరించే దిశగా హామీ ఇస్తూ బాధితులకు ధైర్యాన్ని కల్పిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎటువంటి పెండెన్సీ లేకుండా చూడాలని, త్వరితగతిన దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసులను పూర్తి చేయాలని సూచించారు.

## కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన కరాటే విద్యార్థి అఖిలేశ్వర్ రెడ్డికు ఘన సన్మానం



**మహబూబ్నగర్ మేజర్‌న్యూస్:** కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన అఖిలేశ్వర్ రెడ్డిని జీకే మాస్టర్ జి కృష్ణయ్య చైర్మన్ రవి కుమార్ సన్మానించారు షోటోకాన్ బ్లాక్ బెల్ట్ కరాటే విద్యార్థి అఖిలేశ్వర్ రెడ్డిని శుక్రవారం జిల్లా, కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.క్రిష్ణయ్య మాట్లాడుతూ తమ విద్యార్థి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థులు పోలీసు ఉద్యోగాలు మరియు ఇతర ఉద్యోగాలకు ఫిజికల్ ఫిట్నెస్ ఉంటారని అన్నారు చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల విద్యార్థులు పోలీస్, ఇతర ఉద్యోగాలకు సంబంధించి ఫిట్ నెస్ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీనియర్ మాస్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో స్థానిక డైట్ కళాశాల మైదానంలో అఖిలేశ్వర్ రెడ్డి కరాటే శిక్షణ పొందారని, అన్నారు పోలీస్ ఉద్యోగానికి ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉందని అఖిలేశ్వర్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా విద్యార్థులు పోలీస్, ఇతర ఉద్యోగాలకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ శివకుమార్ పవన్, కళ్యాణ్, రిశ్విత్ తదితరులు పాల్గొన్నారు.

## డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ పియుగా ప్రొఫెసర్ జైపాల్ రెడ్డి



**మహబూబ్ నగర్ పియు మేజర్ న్యూస్ :** పాలమూరు యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ గా ప్రొఫెసర్ జయపాల్ రెడ్డిని నియమించారు. శుక్రవారం వీసీ చాంబర్‌లో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ పీయూగా ప్రొఫెసర్ జయపాల్ రెడ్డికి పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్బీ లక్ష్మీకాంత్ రాథోడ్ నియామక పత్రాన్ని అందజేశారు. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ పాలమూరు యూనివర్సిటీగా నియామకమైన ప్రొఫెసర్ జయపాల్ రెడ్డి గతంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్, హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్మెంట్ ఫిజిక్స్, ఐక్యూఏసి డైరెక్టర్, పీయూ పీజీ ప్రిన్సిపల్ ,వనపర్తి పీజీ కాలేజ్ ప్రిన్సిపల్‌గా పని చేశారు. ప్రస్తుతం బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఫిజిక్స్ పిజి సెంటర్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఓఎస్డీడా మధుసూదన్ రెడ్డి, అధ్యాపకులు,పి ఆర్ ఓ డా: రవి కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## అల్లంపూర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా సరస్వతి



**అల్లంపూర్ మేజర్ న్యూస్:** అల్లంపూర్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా శుక్రవారం రోజు సరస్వతి బాధ్యతలు చేపట్టారు. గత రెండు రోజుల క్రితం ఉన్న మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యకు ఈటీవీలో బదిలీ కావడంతో ఆయన స్థానంలో సరస్వతికి అల్లంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది గతంలో విధులు చేపట్టిన కమిషనర్లు అనేక సమస్యల పైన పనులన్నీ పెండింగ్లో ఉండడంతో వాటిని అధిరోహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చాకచాకంగా మున్సిపల్ అభివృద్ధికై కృషి చేస్తారని ప్రజలు కోరుతున్నారు.

## భవిత కేంద్రాన్ని పరిశీలించిన ఐఈ కోఆర్డినేటర్ మరియు మండల విద్యాధికారి



**శ్రీరంగాపూర్ మేజర్ న్యూస్ :** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని నాగసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని జిల్లా ఇ ఈ కోఆర్డినేటర్ యుగంధర్, మండల విద్యాధికారి జయరాములు పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అందుతున్న బోధన మరియు ప్రతివారం వారికి అందుతున్న స్పీచ్ థెరపీ గురించి వాకబు చేశారు. అలాగే ప్రతి శనివారం నిర్వహిస్తున్న హోం బేస్డ్ ఎడ్యుకేషన్ గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తెలుగు, ఆంగ్లం భాషలో రాత నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలో టీ.వి.కియూట్యూబ్‌ని అనుసంధానించి విద్యార్థులకు చూపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి , ఉపాధ్యాయులు చిన్న రాములు, ప్రదీప్, ఇఈరిసోర్స్‌పర్సన్‌స్వామి పాల్గొన్నారు.

## అనుమానస్పద రీతిలో బాలిక మృతి

### - కన్నతల్లి కడితేర్చినట్లు బంధువుల ఆరోపణ



**లింగాల, మేజర్ న్యూస్:** కొత్తకుంటపల్లి గ్రామంలో అనుమానస్పద రీతిలో బాలిక మృతి చెందిన సంఘటన వెలుగు చూడగ కన్నతల్లె కడ తీర్చినట్లు బంధువులు ఆరోపించడంతో తీవ్ర కలకలం రేగింది. మృతి చెందిన బాలిక బంధువులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తగిలి తిరుపతయ్య తగిలి మహేశ్వరి దంపతుల రెండవ కూతురైన తగిలి జాను(6) శుక్రవారం మృతి చెందగా కన్నతల్లి బాలిక మృతి పై పొంతన లేకుండా సమాధానాలు ఇవ్వడంతో అనుమానించిన బంధువులు అంత్యక్రియలను నిలుపుదల చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి తిరుపతయ్య నాగర్ కర్నూల్ లో ఉంటూ సౌండ్, డెకరేషన్ పనులను చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా మహేశ్వరి తన ముగ్గురు పిల్లలతో కలిసి కొత్తకుంట పల్లి గ్రామంలో ఉంటున్నది. గురువారం రాత్రి గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరైన మహేశ్వరి తాగిన మైకంలో ఇంటికొచ్చి బాలికను కొట్టడంతోనే మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు. సంఘటన స్థలానికి సీఐ రవీందర్, ఎస్సై జగన్మోహన్ చేరుకొని పంచనామ నిర్వహించారు. మృతి చెందిన బాలిక బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రవీందర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకొని బాలిక పార్థివ దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేటకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న జాను మృతి చెందడంతో పాఠశాలకు సెలవు ప్రకటించి సంతాపం ప్రకటించారు.

# కన్నుల పండుగగా పాలెం వెంకన్న రథోత్సవం జాతర

### - జిల్లాస్థాయి భజనపోటీలు విజేతలకు నగదు పంపిణీ
### - మండల స్థాయి గోవింద నామ విజేతలకు బహుమతులు అందజేత



**బిజినపల్లి మేజర్ న్యూస్ :** మాఘరథ సప్తమి పర్వదినం పురస్కరించుకొని బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో 1962 వెలసిన వెంకటేశ్వర స్వామి రథోత్సవం జాతర దేవాలయ లోప్రత్యేక పూజలు శుక్రవారంవైభవంగా జరిగాయి. ఆలయంలో ఉదయకాల పూజలు నిత్య ఆరాధన, పుణ్యాహవచనం, స్వామివారికి ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు కొరవి రామానుజాచా ర్యులు వేదపండిత అర్చక బృందం విశేషంగా నిర్వహించారు.శుక్రవారం నాడు జిల్లాస్థాయి భజన మండల పోటీలు భక్తిశ్రద్ధలతోనిర్వహించి, విజేతలకు మాజీసర్పంచ్ గోవిందు లావణ్య నాగరాజు నగదు బహుమతులను అందజేశారు.జిల్లాస్థాయి భజన పోటీల్లో ప్రథమ బహుమతి బిజినపల్లి చెందిన ఆనందగిరి భజన మండలివారికి 8వేల రూపాయలు,వనపర్తికి చెందిన ఉమామహేశ్వర భజన మండలి వారికి ద్వితీయ బహుమతి 6వేలరూపాయలు,మందాపూర్ గ్రామానికి చెందిన ఉమామహేశ్వర భజన మండలికి తృతీయ బహుమతి 4వేలరూపాయలు,కన్సోలేషన్ బహుమతులను మహబూబ్నగర్ భజన మండలి గురుకుంట భజన మండలి వారికి బి.జగన్ జనరల్ స్టార్ వారు వెయ్యి నగదు ప్రత్యేకంగా మాజీ సర్పంచ్ గోవిందు లావణ్య నాగరాజులు ఆలయ ఆవరణలో అందజేశారు. మండల స్థాయి గోవిందనామ పోటీలలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమానాలను భవాని,వర్షిత్,శ్రీముఖి విద్యార్థులకు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మహబూబ్నగర్ చెందిన గురువయ్యా చార్యులు, వెంకటేశ్వర్లు,రాధిక,పవన్, కొంకలిమధు లు వ్యవరించారు. వెంకటేశ్వర భాగవతర్ చే నిర్వహించిన శ్రీనివాస హరి హరికథ భక్తులను అలరించాయి. ఆలయ చైర్మన్ జున్నా శేఖర్ రెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని ఉదయం నుండి రాత్రి వరకు పాల్గొన్న భక్తులు స్వీకరించారు.ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ జున్నా శేఖర్ రెడ్డి, ఆలయ ఈవో సిహెచ్ రంగారావు,కమిటీ సభ్యులు గాడి సురేందర్,బాలస్వామి గోపాలస్వామి,గంధం నికిత వెంకటేష్, నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది ఆర్ శివకుమార్, బాబయ్య, శ్రీవారి సేవకులు, జగదీష్, శివ, కొండమ్మ, శేఖర్, రవీందర్ రెడ్డి, వివిధ ప్రాంతాలనుండి భక్తులు మహిళలు అధికసంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం : జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి రాజేష్ బాబు



**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** ఆపదలో ఉన్న ప్రతి వ్యక్తికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని, రక్తదానం ప్రాణదానం తో సమానమని ముఖ్యంగా యువకులు రక్తదానానికి ముందుకు రావాలని నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి రాజేష్ బాబు అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి రాజేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ కాలేజీ సందర్శన సమయంలో జిల్లాలో రక్త నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారని ఆయన తెలిపారు. అందుకు అనుగుణంగానే నేడు జిల్లా న్యాయస్థానంలో నేడు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. కోర్టు చరిత్రలో ఇప్పటివరకు నాగర్ కర్నూల్ జిల్లా కోర్టులో ఇప్పటివరకు రక్తదాన శిబిరాన్ని ఎవరు నిర్వహించలేదని ఇప్పుడు నిర్వహిస్తున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్న వ్యక్తులకు రక్తం అందక అనేకమంది మరణిస్తుంటారని అలాంటి వారి ప్రాణాలను కాపాడే వారే రక్తదానం చేసిన వారు అవుతారని ఆయన చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కోర్టులో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి సబిత మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వ్యక్తులను కాపాడటమే కాకుండా తమ వయసును తగ్గించుకున్న వారమవుతామని ఆమె చెప్పారు. మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల మళ్లీ రక్త కణాలు నూతన రక్తాన్ని పునరుత్పత్తిని చేస్తాయని ఆమె తెలిపారు. రక్తదానం చేయడంలో ఉన్న అపోహలని ఆమె నివృత్తి చేశారు. నేడు కోర్టులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జిల్లా న్యాయమూర్తులు సవిత మౌనిక లు రక్తదానం చేశారు. న్యాయమూర్తులు న్యాయవాదులు కోర్టు సిబ్బంది తదితరులు రక్తదానంతో 45 యూనిట్ల రక్తదానాన్ని జర్నల్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు నాగర్ కర్నూల్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు సబిత, మౌనిక, మమతా రెడ్డి, శ్రీనిధి, బార అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రావు కార్యదర్శి పర్వత్ రెడ్డి హాస్పిటల్ సూపరిండెంట్ రఘు డాక్టర్ రోహిత్ డిప్యూటీ డిఎంహెచ్ఓ వెంకట్ దాస్ కోర్టు సిబ్బంది న్యాయవాదులు జనరల్ ఆస్పత్రి వైద్యులు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు

### - ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలులోకి తీసుకురావాలి



**నారాయణపేట్ మేజర్‌న్యూస్:** నారాయణపేట్ జిల్లాలోనిస్కూల్, కాలేజీలు, ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేట్ యజమన్యం పై డి.ఇ.ఓ.కి వినతిపత్రం అదచేశారు, ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏలిగెండ్ల వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ స్కూళ్ల కాలేజీ యాజమాన్యలకు సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ఉన్నా కూడా విద్య సంస్థ దోపిడీ చేస్తున్నవి , ప్రభుత్వం ఉత్తర్వులను లెక్క చేయకుండా అధిక ఫీజులతో విద్యార్థుల యొక్క తల్లిదండ్రులను వేధిస్తున్నారు. సంత్సరం ఎండింగ్ పరీక్షల టైంలో ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ కాలేజీ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల ప్రాణాలతో పొల్యూషన్ లేని బస్సులతో విద్యార్థులపై చెలగాటలాడుతునయన్నరు 2005 లో హైకోర్టు ఫీజు నియంత్రణ చట్టం తీసుకువస్తే ఆ జీవో అమల్లోకి రాలేదు. కావున ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చి, అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని డి.ఇ.ఓ,కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలోఆర్టీఐ పిసి సభ్యులు కావలి రవికుమార్, సంద వెంకటేష్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### - జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.కె. సుధాకర్ లాల్




**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** అసంక్రమిత వ్యాదుల మూడవ విడత స్క్రీనింగ్ పరీక్షలు త్వరలో ప్రారంభిస్తున్నామని అందులో భాగంగా నాగర్‌కర్నూలు డివిజన్ పరిధిలోని పల్లె దవాఖాన వైద్య అధికారులకు, స్టాఫ్ నర్స్ లకు, పర్యవేక్షణ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యలయంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా కె సుధాకర్ లాల్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ ను గత రెండు విడతలుగా విజయవంతంగా నిర్వహించామని మళ్ళీ ఇప్పుడు మూడవ విడత ఎన్.సి.డి. స్క్రీనింగ్ పరీక్షలు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఆశాలు, ఏ.ఎన్.ఎమ్.లు నిర్వహించేలా ప్రతి ఒక్కరికి ట్రైనింగ్ అందించడం జరుగుతుందని ఈ శిక్షణాను సద్వినియోగ పరుచుకొని మన జిల్లాను ఎన్.సి.డి. స్రీనింగ్‌లో ఉన్నత స్థానంలో ఉంచాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డా. అబ్దుల్ వశి అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్ దాస్, ఎన్సిడి ప్రోగ్రాం అధికారి కృష్ణ మోహన్, జిల్లా ఇమ్యునైజెషన్ అధికారి డా. రవి కుమార్ నాయక్,డా. తారసింగ్, డా. ప్రదీప్, వైద్య అధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఏ.ఎన్.ఎమ్.లు పాల్గొన్నారు.

## హిట్ అండ్ రన్ సెక్షన్స్ ను రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్‌ల నిరసన



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రవేశపెట్టి అమలు చేసిన హిట్ అండ్ రన్ సెక్షన్స్ ను రద్దు చేయాలని పబ్లిక్ అండ్ ప్రైవేటు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా గద్వాల జిల్లా ప్రైవేటు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వీరికి వివిధ సంఘాల నాయకులు మద్దతు ఇచ్చారు. అదేవిధంగా గద్వాల జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్ ఆవరణలో దేవి రేణుక ఎల్లమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ సెక్షన్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 3 నెలల పాటు ఆటోల మీద ఈఎంఐ పైమరిటోరియం ప్రకటించాలని, ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్ ఫిట్నెస్ ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా ,ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం రవాణా కార్మికులకు వర్తింప జేయలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని, ఆటో, క్యాబ్, గూడ్స్ ట్రాన్స్పోర్ట్ బస్సు తదితర అన్ని రకాల ప్రేవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

## ఆటోల బంద్ విజయవంతం



**ఇటిక్యాల మేజర్ న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో బిఆర్ టీ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య ఆదేశాల మేరకు శుక్రవారం బి ఆర్ టి యు అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షులు ఉపేంద్ర బాబు మరియు కమిటీ సభ్యులు ఎర్రవల్లి మండల కేంద్రంలో లోఆటో బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బి.ఆర్.టి.యు అధ్యక్షులు ఉపేంద్ర బాబు మాట్లాడుతూ బస్సులకు ఉచితాలు ప్రకటించి ఆటోవాలమైన మా కడుపు కొట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు అలాగే ప్రభుత్వ బస్సులకు ఉచితాలను నివారించి మాకు తగు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో భాగంగా మంద బాలు, బోయ రామాంజనేయులు, వద్దే కృష్ణ, గద్వాల్ సతీష్, మంద రాజేష్, మధు, కోదండపురం భాష, గురు స్వామి, మంద అశోక్, హరిబాబు, శపోగు నర్సింహ మరియు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆటోల బందుకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్ నాయకుడు



**రేవల్లి మేజర్‌న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తున్నటువంటి ఆరు ఉచిత గ్యారెంటీ పథకాలను భాగంగా ఏర్పాటు చేసినటువంటి మహిళ ఉచిత బస్ ప్రయాణాలు వల్ల రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లు తమకు అటో నడువకా ఉన్న ఉపాధి అవకాశాలు కోల్పోయినందుకు నిరసనగా తెలంగాణ రాష్ట్ర మొత్తం గురువారం చేపట్టినటువంటి ఆటోల బందుకు మండల మండల ఆటో డ్రైవర్ల అందరూ తమ ఆటలను ఆపి నిరసన వ్యక్తం చేశారు ఈ విషయం తెలిసిన స్థానిక రేవల్లి బిఆర్ఎస్ నాయకుడు మాజీ సర్పంచ్ భర్త శివరామిరెడ్డి తన మద్దతు తెలిపారు. శివరాం రెడ్డి మాట్లాడుతూ మహిళ ఉచిత బస్ ప్రయాణాల వల్ల కొంతమంది అటో డ్రైవర్ లు ఉపాధి కోల్పోతారు తెలిసి, ప్రభుత్వం వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించకుండా ,వారిని కష్టాలపాలు చేస్తున్నారని. ఈ విధమైన పద్ధతి మంచిది కాదని ఇకనైనా వారికి చూపిస్తూ జీవన భృతి చూపిస్తూ వారి అదయ వనరులు కొనసాగే విధంగా చూడాలని చెప్పారు.

## భారత్ బంద్ కు ఆటో యూనియన్ డ్రైవర్లు మద్దతు



**గోపాలపేట మేజర్ న్యూస్ :** గోపాలపేట మండలంలో దేశ వ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ శుక్రవారం నాడు విజయవంతమైన ది ఈ సందర్భంగా భారత్ బంద్ మద్దతుగా ఆటో యూనియన్ డ్రైవర్లు మద్దతు తెలిపారు ఆటో డ్రైవర్లు జీపు డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు.

## విజయవంతమైన గ్రామీణ సడక్ బంద్



**దావంరగిద్ద మేజర్ న్యూస్ :** గ్రామీణ భారత బంద్ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా మండలంలో ప్రగతిశీల రైతు సంఘం రైతు సంఘం సిఐటియు కార్మిక సంఘం ఐఎఫ్టియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ట్రాక్టర్ ఆటో బైకు ర్యాలీతో వెళ్తూ అంబేద్కర్ చౌరస్తాలో సభ నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య నాయకులు సిపిఎం నాయకులు గోపాల్ సిపిఐ ఎంఎల్ ప్రజా పంత పి తాయప్ప సిఐటియు నాయకులు జోషి పి వై ఎల్ నాయకులు పి మధు పిడి ఎస్ యు నాయకులు మహేష్ కార్మిక సంఘం నాయకులు శివ ఎస్ఎఫ్ఐ నాయకులు డివైఎఫ్ఐ నాయకులు మిగతా ప్రజా సంఘ నాయకులు గ్రామపంచాయతీ వర్కర్స్ అంగన్వాడీ టీచర్స్ అంగన్ వాడి అయాలు పాల్గొని మోదీ చేస్తున్న అన్యాయాలకు కార్మికుల కు జరుగుతున్న నష్టాన్ని వివరిస్తూ రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల వివరించారు కేంద్రం రైతు చుట్టాలని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండు చేశారు.

## కార్మికులకు కనీస వేతనం ప్రకటించాలి : ఐ.ఎఫ్ టి.యు జిల్లా అధ్యక్షులు జె. ఎన్. దేవదానం



**చిన్నచింతకుంట మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తిత సార్వార్ధిక సమ్మె గ్రామీ ణ భారత్ బంద్ భాగం గా చిన్న చింత కుంటలో ర్యాలీ నిర్వహించి సమ్మె విజయవంతం చేయ డం జరిగింది. దేశంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన కార్మిక రైతాంగ విధానాలకు వ్యతిరేకంగాఈ సమ్మెలో ఉద్దేశించి ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు జేఎన్ దేవాదానం మాట్లాడారు నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఈ దేశంలో పేదరికం నిర్మూలిస్తారని అధిక ధరలను నియంత్రిస్తానని చెప్పిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించి మతతత్వ విధానాలను అమలు చేస్తూ కార్మికులను మోసం చేస్తూ బడా కార్పొరేట్ శక్తులను పోషిస్తూ వారికి అనుకూలమైన చట్టాలను తీసుకొస్తూ కార్మికుల పొట్టలు కొడుతున్నారు ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటాలను కోట్లుబడుస్తూ రైతుకు నల్ల చట్టాలు తీసుకురావడం జరిగింది వాటికి వ్యతిరేకంగా పోరా డుతున్న రైతులను అణిచివేస్తున్నారని అలాగే రైతు నల్ల చట్టాలను వెంట తీసుకోవాలని నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని కార్మికులకు అందరికీ కనీస వేతనాలు 26,000 పెంచాలని ఈ సమ్మెలో డిమాండ్ చేశారు.ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు కోళ్లవెంకటన్న ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏకొండన్న అరుణోదయ జిల్లా అధ్యక్షులు చంద్రన్న ఐఎఫ్టియు జిల్లా నాయకులు వెంకటేష్ గౌడ్ గ్రామపంచాయతీ మండల అధ్యక్షుడు కే కురుమన్న భాను నిర్మాణ నాయకులు రాజు మరియు గ్రామపంచాయతీ కార్మికులు బీడీ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## కార్మిక చట్టాలను రద్దు చేయాలి
### - టిఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. యాదగిరి



**చిన్న చింతకుంట మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు నల్ల చట్టాలను వెనక్కి తీసుకొని యధా తధంగా పాత రాజ్యాంగ పరిధి లోని చట్టాలను అమలు చేయాలని తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలి నుండి ర్యాలీ నిర్వహించి అనంతరం చౌరస్త లో భారత్ బంద్ ను ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. యాదగిరి మాట్లాడుతూ ప్రజా స్వామ్యం లో ప్రభుత్వాలు ఎప్పుడైనా సరే కార్మికుల, రైతుల తరపున ఉంటూ వారి సంక్షేమం కోసం ప్రణాళికలు రూపొందించే విధంగా ఉండాలి కానీ కేంద్రం లో ఉన్నా భాజపా సర్కారు కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధంగా నల్ల చట్టాలను అమలు చేయాలని భావిస్తోందని అది దేశంలో ఉన్న పారిశ్రామిక రంగం పైన ప్రభావం చూపే పరిస్థితి ఉన్నందున కేంద్ర ప్రభుత్వం వెంటనే వాటిని వెనక్కి తీసుకొని కార్మికులకు ఇళ్లు, వారి పిల్లలకు నాణ్యమైన విద్యను మరియు స్కాలర్ షిప్ లను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో బాబు, నరసింహ, భిక్షపతి, నాగరాజు, రాజు, దయాకర్, మొగిలన్న, నాగులు, తదితరులు పాల్గొన్నారు.

## కదం తొక్కిన రైతు ,కార్మిక ,కర్షక లోకం



**అల్లంపూర్ మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ మండల కేంద్రంలో దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ విజయవంతం. ఎస్కేయం (సంయుక్త కిసాన్ మోర్చా ) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అల్లంపూర్ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అనంతరం ఎంపీడీవో కార్యాలయం ముందు తెలంగాణ రైతు సంఘం గద్వాల జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న అధ్యక్షతన ధర్నా నిర్వహించారు . ఈ సమ్మెకు మద్దతు గ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం గద్వాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రేపల్లె దేవదాసు, తక్కశిల రాఘవేంద్ర, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రాజు ,ఆశ అంగన్వాడి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏమేలమ్మ, రైతు సంఘం జిల్లా నాయకులు సింగరాజు మద్దిలేటి, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, సిపిఎం పార్టీ అల్లంపూర్ మండల కార్యదర్శి బి నర్సింలు, హమాలీ సంఘం నాయకులు వెంకటరాముడు వెంకటేశ్వర్లు ఆశా అంగన్వాడి కార్యకర్తలు రైతులు డ్రైవర్లు హమాలీలు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## హక్కుల కోసం కదం తొక్కిన కార్మికులు



**వడ్డేపల్లి మేజర్‌న్యూస్:** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీ, సభ నిర్వహించుకున్నారు. మహాలక్ష్మి కాంప్లెక్స్ వద్ద సిఐటియు వడ్డేపల్లి మండల కార్యదర్శి సంజీవరాజు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ. వెంకటస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సభలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు తిప్పన్న, యుటిఎఫ్ జిల్లా నాయకులు తిలక్, కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పరంజ్యోతి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, సిఐటియు వడ్డేపల్లి మండల కన్వీనర్ సంజీవరాజు, కో కన్వీనర్ %a% ట్రాన్స్ పోర్టు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నరసింహులు, నేషనల్ హైవే పుల్లూరు టోల్ ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మద్దయ్య, కోశాధికారి శేషన్న, సిఐటియు అమాలి సంఘం సీనియర్ నాయకులు భీమన్న ,అంగన్వాడి యూనియన్ నాయకురాలు సలోమి, సుమిత్ర,పద్మావతి, వెంకటమ్మ, శివ శంకరమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మమత, సుజాత, భాగ్యలక్ష్మి, పద్మ ,జయమ్మ. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు శివన్న, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టి యు నాయకులు మధు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నరసింహ, పాల్గొని మాట్లాడారు. సభ అనంతరం శాంతినగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాలు, ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, హమాలీ కార్మికులు, ఆటో డ్రైవర్లు, జీప్ డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, నేషనల్ హైవే టోల్ గేట్ ఎంప్లాయిస్, మధ్యాహ్న భోజన కార్మికులు, వడ్డేపల్లి, రాజోలి, మానవపాడు ఇటిక్యాల మండలాలకు సంబంధించిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హక్కుల కోసం కదం తొక్కిన కార్మికులు




**ఉండవెల్లి మేజర్ న్యూస్:** రోడ్డు రవాణా రంగ కార్మికులకు సామాజిక భద్రత చట్టాన్ని రూపొందించాలని దేశవ్యాప్త కార్మిక సమ్మెను ఉండవెల్లి మండలం అల్లంపూర్ చౌరస్తా లో తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సమ్మె చేయడం జరిగినది. ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ జిల్లా అధ్యక్షుడు యం వెంకటేశ్వర్లు మాట్లాడరు ఈ కార్యక్రమం లో తిరుపతి నాయుడు ఉపాధ్యక్షుడు సమివుల్లా, విజయ్ గౌడు, గన్నిమియ్య, నరేష్ గౌడ్, చందు, మహేష్, కిషోర్ గౌడ్, కృష్ణ, ఆంజనేయులు, మహేష్, అనిల్, తదితరులు, పాల్గొన్నారు.

# కదం తొక్కిన రైతు, కార్మిక, కర్షక లోకం

**పాలమూరు మేజర్‌న్యూస్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మెలో భాగంగా కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్ హాల్ నుండి తెలంగాణ చౌరస్తా వరకు కొన సాగిన భారీ ర్యాలీ విజయవంతం అయింది. సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎన్టియుసి, ఐఎఫ్‌టీయూ, టిఎన్టియుసి సంఘాల నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, రామ్మోహన్, రాములు యాదవ్, వెంక్‌టేష్, ధన్వాడ రాములు జరిగిన కార్యక్రమంలో కార్మికులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమ్మెకు యూబిఐ బ్యాంక్ అసోసియేషన్ నాయకులు జెట్టి రాజేష్, తిరుమల్ రెడ్డి మద్దతుగా ప్రసంగించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎర్ర నరసింహులు ప్రభాకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వర్ధగాలన్న ,ప్లంబర్స్ అసోసియేషన్ ముక్తార్ ఖాన్ ,టైల్స్ అండ్ గ్రానైట్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి నాయక్, బిల్డింగ్ పెయింటర్స్ యూనియన్ నాయకులు విశ్వనాథం, హమాలీ యూనియన్ నాయకులు గోనెల ఆంజనేయులు, యాదగిరి, వెంకటేష్, రాజు, గోపాల్, గోవర్ధన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్ గౌడ్ ,భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు పడాల వెంకటయ్య, వరద లక్ష్మయ్య, సిఐటియు జిల్లా కోశాధికారి చంద్రకాంత్, పట్టణ నాయకులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.


















### రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ప్రధాన మంత్రి దిగిపోవాలి

**ఉట్కూర్ మేజర్ న్యూస్ :** గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా బిజ్వార్‌లోనీ భారీగా రైతులు తమ ట్రాక్టర్లతో ఊరేగింపు నిర్వహించి నిరసన చేశారు వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు వెళ్లకుండా స్వచ్ఛందంగా తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకో వెళ్లకుండా అమ్మకాలను నిలిపివేశారు. గ్రామ ప్రజలు ర్యాలీలో డప్పుల ప్రదర్శనతో ఊరేగింపుగా వచ్చి భగత్ సింగ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ఉద్దేశించి సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు, డివిజన్ నాయకులు సిద్దు, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు, జి వెంకట్ రెడ్డి, పొర్ల నరసింహ, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే మల్లేష్ నాయకులు పి వై ఎల్ జిల్లా నాయకులు బాలకిషన్ తిరుపతి సింగిల్ విండో డైరెక్టర్ చెన్నప్ప దొరోళ్ళ ఆంజనేయులు, మాట్లాడుతూ జై జవాన్ జై కిసాన్ అనే నినాదం అన్నారు ఈ కార్యక్రమంలో , లొట్టి గోవిందు, పి తిరుమలేష్,బొడ్డపోల్ల నరసింహ, మహేందర్ గౌడ్, తోక కథలప్ప పిరికి రాము, దొబ్బలి చెన్నప్ప, కే ఆశప్ప, పిరికి హనుమన్న,డొలిమి అంజనేయులు రైతు సంఘం నాయకుడు మీదిగేరి చంద్రప్ప, వ్యవసాయ, రైతు కార్మిక సంఘం నాయకులు కార్యక్రమంలో పాలుకొన్నారు.

### కార్పొరేటర్లకు రెడ్ కార్పేట్ పరుస్తున్నారు

### – సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్

**జడ్చర్ల మేజర్ న్యూస్ :** బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ బడాకార్పొరేటర్లకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్ ఆరోపించారు. దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో భాగంగా సిఐటియు ఇతర అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జడ్చర్లలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య అధ్యక్షతన స్థానిక డాక్టర్ బి.ఆర్‌అంబేద్కర్ భవనం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జగన్, సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు భాగీ కృష్ణయ్య, వసియా బేగం, ఎం.డి.మున్నా, ఎల్‌ఐసి అధ్యక్షులు శ్రీనివాస్, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు సరోజ, రాజ్యలక్ష్మి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు నరసమ్మ, సునీత, మయూరి, నసీమా, గ్రామపంచాయతీ కార్మికులు ఎం.డి పాషా, చెన్నయ్య, శ్రీనివాసులు, వివోఏ సంఘం అలివేల, రమాదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### మండలంలో బంద్ నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘాలు

**వంగూరు మేజర్‌న్యూస్:** దేశవ్యాప్త సార్వత్రిక కార్మిక సమ్మె గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా మండలంలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు బ్యాంకులను బందు చేయించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చింత ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపది సంవత్సరాల కాలంలో నిత్యవసర ధరలను పెంచి నిరుపేదల నడ్డి విడిచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తుల పరం చేస్తున్నారన్నారు. విదేశాల్లో ఉన్న డబ్బును తెచ్చి నిరుపేదలకు పంచుతామని ఒక రూపాయి పంచ లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని విద్య వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ కూలీల రేట్లు పెంచాలన్నారు. అదేవిధంగా చిరు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ సమాన పనికి సమాన వేతనంతో పాటు కనీస వేతనాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి బాలస్వామి శివరాములు వెంకటయ్య కేశవులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కల్వకుర్తిలో సార్వత్రిక సమ్మె విజయవంతం

**కల్వకుర్తి మేజర్‌న్యూస్:** బిజెపి కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చేపట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మె లో భాగంగా శుక్రవారం కల్వకుర్తి ఎమ్మార్వో కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఈ సందర్భంగా సిఐటియు అనుబంధ సంఘాలైన ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, విలేజ్ బుక్కీ పర్స్, భవన నిర్మాణ కార్మికులు, ఆటో, హమాలీ కార్మికులు, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ కార్మిక సంఘం వివిధ రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో వివిధ రంగాల కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆర్డిఓకు కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు, అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చి పది సంవత్సరాలు గడిచిన రైతాంగ కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదని మండిపడ్డారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆనంద్ కుమార్, శాన్వాజ్ ఖాన్, పైళ్ల గోపాల్, యుటిఎఫ్ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఏపీ మల్లయ్య, ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కె. వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక బాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు టి. కిషోర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చింత ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి, శ్రీనివాసులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం. మాసమ్మ, సిఐటియు వంగూరు మండల కన్వీనర్ బి, శివ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి. బాలస్వామి, హమాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ బాలయ్య, విలేజ్ బుక్కీ పర్సు సంఘం జిల్లా నాయకులు రామస్వామి, అంజయ్య మున్సిపాలిటీ యూనియన్ కల్వకుర్తి అధ్యక్ష కార్యదర్శులు శ్రీశైలం, పెద్దులు, పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మహేష్, శంకర్, పరశురాములు, ఆంజనేయులు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకురాలు అనురాధ ,జహీదా ఆశ వర్కర్స్ యూనియన్ వలియా, రఫిక ,వరలక్ష్మి, మంజుల, కెవిపిఎస్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసన

**నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** ఆల్‌ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేర %ూ×ూ+జుఖీ% జాతీయ ఉపాధ్యక్షులు మరియు టీఎన్జీఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ మారం జగదీష్ ఆదేశలతో టిఎన్జీవోస్ యూనియన్ నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 1గం. భోజన విరామ సమయంలో నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (%×ఱూజ%) నందు లంచ్ అవర్ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు బావండ్ల వెంకటేష్, కోశాధికారి ఎండి షర్ఫుద్దీన్, సహాధ్యక్షులు సత్యనారాయణ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు నసీర్, ప్రచార కార్యదర్శి ఎం సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలరాజు కార్యవర్గ సభ్యులు షేక్ కరీముల్లా, బిజినపల్లి యూనిట్ ప్రెసిడెంట్ జి చెన్నకేశవులు, నాగర్ కర్నూల్ యూనిట్ ఉపాధ్యక్షులు కే రామకృష్ణ, టీజీవోకోశాధికారి రాజు, మెడికల్ అండ్ హెల్త్ ఫోరమ్ ప్రెసిడెంట్ %=% శ్రీను,కార్యవర్గ, పంచాయతీ సెక్రెటరీ డిస్టిక్ ఫోరం అధ్యక్షులు రాజు, నాయకులు స్కైలాబ్, కేశవులు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాఘవేందర్ సింగ్ , సుభాష్ , మరియు జిల్లా సమీకృత భవనంలోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

### రైతుల హక్కుల సాధనకై తలపెట్టిన భారత్ బంద్‌కు సంఘీభావం

**అయిజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పురపాలక సంఘం రైతుల హక్కుల కొరకు సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మునిసిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఐజ తరపున మున్సిపల్ కార్మికులు హమాలీ కార్మికులు ఆశా కార్యకర్తలు ఐజ మున్సిపాలిటీ పరిధిలో కర్నూల్ రోడ్డు చౌరస్తా నుండి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రనాథ్, మునిసిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ టౌన్ అధ్యక్షుడు నరేష్ లు మాట్లాడుతూ కేంద్రం తీసుకుంటున్న కార్మిక చట్టాల రద్దు ప్రైవేటీకరణను కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు విజయభాస్కర్ రెడ్డి, వినోద్, యూనియన్ సభ్యులు ఈశ్వర్, శీను, ఆంజనేయులు, అడివన్న, సుధాకర్, వెంకటేష్, వీరేష్, ప్రకాష్, రాకేష్, సురేందర్, శాంతకుమారి, నక్క మరియమ్మ, సుశీలమ్మ, మున్సిపల్ కార్మికులు ఆశా కార్యకర్తలు హమాలీ వారు పాల్గొన్నారు.

### కార్మిక, రైతు డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి.

**ఉట్కూర్ మేజర్ న్యూస్ :** ఉట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో అంబేద్కర్ నుండి బైక్ ర్యాలీగా వాల్మీకి చౌరస్తా నుండి భగత్ సింగ్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వచించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వచించిన కార్మిక కర్షక గ్రామీణ బందులో భాగంగా అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కనకరాయుడు. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకుడు బాబు పార్టీ డివిజన్ నాయకుడు చిన్నబాలు, పి,డి,యస్,యూ, జిల్లా నాయకుడు అజయ్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశంలో అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవనాదాయం పడిపోయి పేదల సంఖ్య పెరిగిపోతున్నది. "ఆక్స్ ఫాం" నివేదిక ప్రకారం దేశంలో 80 కోట్ల మంది దారిద్రరేఖకు దిగువన మగిపోతున్నారు.2024 ఏప్రిల్ లో రాబోతున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర మోడి ప్రభుత్వం తిరిగి ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నది. నాలుగు లేబర్ కార్డులను రద్దు చేయాలి.విద్యుత్ సవరణ బిల్లు–2022 ను ఉపసంహరించాలి. స్వామినాథన్ కమిటీ సిఫార్సు లను అమలుచేయాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బుడ్డ కిష్టప్ప,అంజప్ప, లక్ష్మణ్, కొత్తగుడిసె నర్సిములు, గుర్రాల తిప్పయ్య, శివ,లింగప్ప, రాజు, ఉసేన్, ఆంజనేయులు, మహాదేవ్ మరియు రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తిచేయాలి

### - జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష



**నారాయణపేట మేజర్‌న్యూస్:** జిల్లా మెడికల్ కళాశాల మంజూరు అయినందున త్వరలో తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నారాయణపేటలో అప్పంపల్లి లో మెడికల్ కళాశాల విద్యార్థుల కొరకు ప్రారంభించే తరగతుల గదులు ఇతర ఎర్పాట్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో మెడికల్ కళాశాల విద్యార్థులు తరగతులు ఈ అకాడమిక్ ఇయర్ లో ప్రారంభం కానున్నాయని అందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యను అందించాలి - జెడ్పిచైర్ పర్సన్ సరిత



**గద్వాల మేజర్ న్యూస్:** గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జ్ సరితమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు.. పాఠశాలలో చదువుచున్న విద్యార్థులతో కలిసి కొంతసేపు ఉపాధ్యాయురాలిగా సరితమ్మ బోధించి, పాఠ్యాంశాలను విద్యార్థులను అడిగితెలుసుకుని, ఉపాధ్యాయులు విద్యాబోధన ఏవిధంగా బోధిస్తున్నారని తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం జెడ్పి చైర్ పర్సన్ సరితమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యను అభ్యసించాలని ఉపాధ్యాయులకు సరితమ్మ సూచించారు. ప్రైవేటు కు దీటుగా విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలని,విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతిలో అవకతవకలు లేకుండా, నాణ్యమైన భోజనం మోను ప్రకారం అందించాలని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా బాధ్యత రహితంగా వ్యవహరించాలని జెడ్పి చైర్ పర్సన్ సరితమ్మ ఉపాధ్యాయులకు ఆదేశించాడు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అమరావాయి కృష్ణారెడ్డి, తుమ్మల నరసింహులు,డిటిడిసి నరసింహులు, భాస్కర్ యాదవ్, పులిపాటి వెంకటేష్, జమ్మిచేడు ఆనంద్, పాతపాలెం ఆనంద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అల్వాల రాజశేఖరరెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, సద్దనోముపల్లి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులగణన తీర్మానం కాంగ్రెస్ ఘనతే

### - అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**మక్తల్,మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కులగణన చేపట్టాలని కోరుతూ... అసెంబ్లీలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తీర్మానం ప్రవేశపెట్టడం కాంగ్రెస్ పార్టీ ఘనతేనని మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు కులగణనను అతి త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామని అన్నారు. బీఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే స్పూర్తితో కులగణన చేపట్టి.. బీసీలు, అణగారిన వర్గాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ ఫలాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. గత పదేళ్ళలో కులగణన చేపట్టలేదని, ఎలాంటి వివరాలు అందించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకే కులగణన ఘనత దక్కుతుందని అన్నారు. బీహార్ లో మాత్రమే కులగణన పూర్తి అయిందని, ఆ తరువాత స్థానంలో తెలంగాణ నిలుస్తుందని తెలిపారు. బీసీలు, ఇతర అణగారిన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పూర్తి చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. గతంలో పేరుకు ఎంబీసీ కార్పొరేషన్ అని, ఇతర అని నిధులు కేటాయించినా... పూర్తి స్థాయిలో నిధులు అమలు చేయలేదని అన్నారు. పేరుకు మాత్రమే నిధులు కేటాయించామని చెప్పుకున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కులగణన పూర్తి చేసి, అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తుందని తెలిపారు.

## మంచి నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**వనపర్తి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** రానున్న వేసవి కాలంలో ఏ ఒక్క గ్రామ పంచాయతీలో మంచినీటి సమస్య రాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఐ.డి.ఒ.సి. ప్రజావాణి హాల్లో ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే గ్రామపంచాయతీ ఫండ్స్ తో గ్రామపంచాయతీ పనులు పూర్తి చేసి మంచినీటిని ప్రతి ఇంటికి అందించాలని తెలిపారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో తెలుసుకొని సోమవారంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను సూచించారు. తెలంగాణకు హరితహారం లో భాగంగా నర్సరీలలో జర్మనేషన్ తక్కువగా ఉన్నచోట పెంచాలని తెలిపారు. లేబర్ వెజ్ పెంచాలంటే కుంటల్లో, చెరువులతో పాటు కాలువలలో పూడికతీత పనులను, అటవి శాఖ భూముల్లో ఉపాధిహామీ పనులు చేపట్టాలని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించి ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలన చేసి మొదటి స్థాయి నమోదు పూర్తి చేయాలన్నారు. మొదటి స్థాయి పరిశీలన అనంతరం తరువాత స్థాయిలో కలెక్టర్ లాగిన్ కు చేరుతుంది అన్నారు. దీనికి సంబంధించి చివరి తేదీ అంటూ ఏదీ లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంచిత గాంగ్వర్, డిఆర్డిఓ ఉమాదేవి, జడ్పీ సీఈవో యాదయ్య, అదనపు డిఆర్డిఓ నాగేంద్ర , ఎంపీ ఓ లు, ఏపీవోలు, మిషన్ భగీరథ ఈ ఈ మేఘా రెడ్డి, డిపిఓ ,డిఎల్పిఓ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు పార్లమెంటు సీటు హస్తానిదే

### - బీఆరెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు - సీడబ్ల్యూసీ సభ్యులు వంశీ చంద్ రెడ్డి



**నవాబ్‌పేట మేజర్‌న్యూస్ :** సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డికి నవాబ్ పేట మండల నాయకులు ప్రజలు పర్వతాపూర్ మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో ఘనస్వాగతం పలికారు. పాలమూరు న్యాయ యాత్ర 12వ రోజులో భాగంగా మహబూబ్ నగర్ పార్లమెంట్, జడ్చర్ల నియోజకవర్గం, నవాబ్ పేట్ మండలంలోని చల్లా వంశీచంద్ రెడ్డి పాలమూరు న్యాయ యాత్ర జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి సహకారంతో శుక్రవారం జడ్చర్ల నియోజకవర్గం నవాబ్ పేట్ మండలంలోని కాకర్లపాడ్,రుద్రారం, నవాబ్ పేట్ గ్రామాలలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి మాజీ జిల్లా అధికార ప్రతినిధి జనంపల్లి దుష్యంత్ రెడ్డి పాలమూరు న్యాయయాత్ర నిర్వహించారు. వంశీచంద్‌రెడ్డి ఆయా గ్రామాలలోని దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడం జరిగుతుందని అని అన్నారు. ఇప్పటికే రెండు హామీలను అమలు చేశామని త్వరలో మరో రెండు హామీలను అమలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తుంది అని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజా పాలన కొనసాగుతోంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దైవ సన్నిధిలోనే మానసిక ప్రశాంతత : శివునికి ప్రత్యేక పూజలు చేసిన కాయితి ఆశాదీప్ రెడ్డి





**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** దైవ సన్నిధిలోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితి ఆశాదీప్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాండ్ర గ్రామంలో రస సప్తమి సందర్భంగా శివునికి పాలాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆశాదీప్ రెడ్డి దంపతులతో ప్రత్యేక పూజలు, పాలభిషేకం గావించారు, అనంతరం ఆశాదీప్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ దైవ మార్గం ఎంచుకొని సన్మార్గంలో నడవాలని సూచించారు, ప్రతిరోజు కొంత సమయం దేవాలయంలో గడపాలన్నారు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు, బతుకమ్మ కోలాటాలతో ఆలయ ప్రాంగణంలో చూపరులను ఆకట్టుకున్నారు, అనంతరం ఆశాదీప్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయకుమార్ రెడ్డి, జయసింహారెడ్డి, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

### - మండల విద్యాధికారి లక్ష్మణ్ సింగ్



**చిన్నచింతకుంట మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని లాల్ కోట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మాజీ జడ్పిటిసి సులోచనమ్మ. వేణుగోపాల్ సహకారంతో ఏర్పాటుచేసిన సరస్వతి దేవి విగ్రహానికి పూజా కార్యక్రమం నిర్వహించారు ఈ పూజా కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ సింగ్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన తెలిపారు దేశ భవిష్యత్తు రూపకర్తలు విద్యార్థులు ఆయన తెలిపారు. కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ మురళీకృష్ణ, ఎల్. ఎఫ్. ఎల్ .హెచ్ ఎం. వాసంతిక ఉపాధ్యాయులు అరుణ, వెంకటేష్, జయంతి లు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన
విద్యావంతులకు, విలేకరులకు
వనపర్తి జిల్లా : కొత్తకోట, మదనాపురం, ఆత్మకూర్, అమరచింత, పెబ్బేర్ రూరల్, ఖిల్లాఘనపురం, ఏదుల
ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
9948271112, 7702532903